# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని సింగపూర్ వాణిజ్య సంస్థలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు.
- ❖ నైసార్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 వాహక నౌక కొద్ది సేపటి క్రితం నింగిలోకి మోసుకెళ్లింది.
- ❖ ఏపీఎస్ ఆర్టీసీ కోసం 1,350 నూతన బస్సులను కొనుగోలు చేశామని ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు.
- ❖ విశాఖపట్టణంలో నవంబర్ 14, 15వ తేదీల్లో భాగస్వామ్య సదస్సును నిర్వహించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ పోలవరం ఎడమ కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

================================

వ్యాపార అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్న ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్‌లోని వివిధ ప్రముఖ వాణిజ్య సంస్థల ప్రతినిధులను కోరారు. సింగపూర్ పర్యటనలో భాగంగా చివరి రోజు అయిన ఈరోజు పలు కంపెనీలకు చెందిన ప్రముఖులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దిశగా ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికలను ఆయా సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ పార్కులు, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో కూడిన వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

================================

నాసా, ఇస్రో సింథటిక్ ఎపెర్చర్ రేడార్ (NISAR) ఉపగ్రహం జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 వాహక నౌక ద్వారా కొద్ది సేపటి క్రితం నింగిలోకి దూసుకెళ్లింది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుండి ఈ ప్రయోగాన్ని చేపట్టారు. నైసార్

ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్16 వాహక నౌక సూర్య అనువర్తిత కక్ష్యలోకి మోసుకెళ్లనుంది. బయలుదేరిన 19 నిమిషాల అనంతరం 747 కిలోమీటర్ల ఎత్తులో నైసార్ ఉపగ్రహం వాహక నౌక నుంచి విడిపోనుంది. నాసా ఇస్రో సంయుక్తంగా రూపకల్పన చేసి ప్రయోగించిన ఈ నైసార్ ఉపగ్రహం SAR సాంకేతికతను ఉపయోగించుకొని భూమి, మంచు ఉపరితలాల సమాచారాన్ని అందిస్తుంది. అదే విధంగా విపత్తు నిర్వహణ, వ్యవసాయం, వాతావరణ పర్యవేక్షణకు సహాయపడుతుంది.

==============================

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న నేపధ్యంలో ఆర్టీసీ సిబ్బంది కీలకంగా వ్యవహరించాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఈరోజు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు డిపో మేనేజర్లతో ఆర్టీసీ ఛైర్మన్ కోనకళ్ల నారాయణతో కలసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ... త్వరలో ఆర్టీసీకి 1,350 నూతన బస్సులు రానున్నాయని వెల్లడించారు. ప్రతి సంవత్సరం 2 వేల కొత్త విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టనున్నామని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యంతో విశాఖపట్టణంలో నవంబర్ 14, 15వ తేదీల్లో భాగస్వామ్య సదస్సును నిర్వహించనున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈరోజు నిడదవోలులో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఆగస్టు 2, 3 తేదీల్లో రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నామని వివరించారు. తద్వారా అక్కడున్న ఔత్సాహిక పెట్టుబడిదారులను, పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించి పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ రంగంలో నూతన పెట్టుబడులు తీసుకురావడానికి భాగస్వామ్య సదస్సు దోహదపడుతుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 15 సెకన్లు)

==============================

ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందించే లక్ష్యంతో పోలవరం ఎడమ కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతిపై మంత్రి ఈరోజు అధికారులతో దృశ్యమధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని 25,238 చదరపు మీటర్లు పూర్తి చేసి 40 శాతం పురోగతి సాధించామన్నారు. డయాఫ్రమ్ వాల్ 373 ప్యానల్స్ లో 130 పూర్తి చేశామని చెప్పారు. వరద సమయాలలో డయాఫ్రమ్ వాల్ పనులు ఆగకుండా, డీవాటరింగ్ చేసుకుంటూ 2025 డిసెంబర్‌కు పూర్తి చేస్తామని వెల్లడించారు. గ్యాప్-1 ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు 2026 మార్చి నాటికి పూర్తి అయ్యేలా పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు.

విరామం

==============================

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం బూర్జి గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో నడవాలని, ప్రతి కుటుంబం సురక్షితంగా జీవించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలోని తురాయిపాడు బీటీ రహదారికి 2 కోట్ల 20 లక్షల రూపాయలు, ములక్కాయవలస రహదారికి 3 కోట్ల 30 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

==============================

ప్రకాశం బ్యారేజ్ కు వరద నీరు భారీగా చేరుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ సూచించారు. ఈరోజు అమరావతిలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... నదీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లోకి వరద నీరు చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి అప్రమత్తం చేయాలని, ప్రజలు అధికారులకు సహకరిస్తూ.. తమ గ్రామాలకు రక్షణ కవచంగా నిలవాలని మంత్రి కోరారు.

==============================

ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా వారి ప్రాణాలు కాపాడవచ్చని పశ్చిమగోదావరి జిల్లా సర్వే, భూ రికార్డు శాఖా అధికారి కె. జాషువా అన్నారు. భీమవరంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన రక్తం దానం శిబిరాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ఇటువంటి కార్యక్రమాలు జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ సేవా దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ.. ఇతరులకు స్ఫూర్తినిస్తున్నాయన్నారు. ఈ శిబిరంలో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని అందరికీ ప్రేరణగా నిలిచారని పేర్కొన్నారు.

==============================

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీటిని కూటమి ప్రభుత్వం నెరవేర్చుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అనంతపురం జిల్లా చాపిరి గ్రామంలో ఈరోజు జరిగిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పవన, సౌర విద్యుత్ ను ప్రోత్సహించే విధంగా పలు రాయితీలు అందిస్తూ.. రాయలసీమలో పరిశ్రమలు, సోలార్, విండ్ మిల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 81,337 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 144 పాయింట్ల లాభంతో 81,481 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 34 పాయింట్ల లాభంతో 24,855 వద్ద స్థిరపడింది.

==============================

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య చివరి టెస్ట్ మ్యాచ్ ఓవల్ స్టేడియం వేదికగా రేపు జరగనుంది. ఇప్పటికే 2-1 తేడాతో సిరీస్‌లో ఇంగ్లాండ్ ముందజలో ఉంది. ఇక ఈ మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్ ను సమం చేసుకునేందుకు భారత్ సిద్ధమవుతుంది.

==============================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల 24 గంటల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి వివరిస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

==============================
==============================